# 28న స్టేషన్‌ఘన్‌పూర్‌లో బీఆర్‌ఎస్ నియోజకవర్గ సమావేశం

- హాజరుకానున్న మంత్రులు హరీశ్‌రావు, ఎర్రబెల్లి దయాకర్‌రావు
- బీఆర్‌ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్సీ కడియం శ్రీహరి వెల్లడి



బీఆర్‌ఎస్ నియోజకవర్గ సమావేశం నిర్వహించనున్న స్థలాన్ని జడ్పీ చైర్మన్ పాగాల సంపత్‌రెడ్డితో కలిసి పరిశీలిస్తున్న ఎమ్మెల్సీ కడియం శ్రీహరి

స్టేషన్ ఘన్‌పూర్, అక్టోబర్ 25 : నియోజకవర్గ కేంద్రంలో ఈ నెల 28న నిర్వహించే బీఆర్‌ఎస్ ఎన్నికల ప్రచార సభకు మంత్రి హరీశ్‌రావు హాజరు కానున్నట్లు నియోజకవర్గ బీఆర్‌ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్సీ కడియం శ్రీహరి తెలిపారు. నియోజకవర్గ కేంద్రంలో బీఆర్‌ఎస్ కార్యాలయాన్ని మంత్రి హరీశ్‌రావు ప్రారంభించిన అనంతరం నియోజకవర్గ సమావేశం నిర్వహించనున్నట్లు తెలిపారు. బుధవారం నియోజకవర్గ సమావేశానికి సంబంధించిన ఏర్పాట్లను బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు, జడ్పీ చైర్మన్ పాగాల సంపత్ రెడ్డి, నాయకులతో కలిసి పరిశీలించారు. అనంతరం విలేకరుల సమావేశంలో కడియం శ్రీహరి మాట్లాడుతూ.. నియోజకవర్గ సమావేశానికి మంత్రులు హరీశ్‌రావు, ఎర్రబెల్లి దయాకర్‌రావు, సత్యవతి రాథోడ్, మండలి డిప్యూటీ చైర్మన్ బండా ప్రకాశ్, చీఫ్‌విప్ వినయ్ భాస్కర్, ఎంపీ పసునూరి దయాకర్, ఎమ్మెల్యే రాజయ్యతో పాటు పలువురు హాజరు కానున్నారని తెలిపారు. తొమ్మిదేళ్లుగా ముఖ్యమంత్రి కేసీఆర్ చేసిన అభివృద్ధి, అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో పాటు ఇటీవల విడుదల చేసిన ఎన్నికల మ్యానిఫెస్టోతో బీఆర్‌ఎస్ విజయం ఖాయమైందని, డిసెంబర్ మూడున ఆ ఫలితాలను చూడబోతున్నామని కడియం పేర్కొన్నారు. ఇటీవల కర్ణాటక రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ అక్కడి ప్రజలకు రోజుకు ఐదు గంటలు కూడా కరెంటు ఇవ్వడం లేదని, ప్రజలు ధర్నాలు , రాస్తారోకోలు చేస్తున్నారన్నారు. అక్కడ 24 గంటల కరెంటు ఇవ్వకుండా ప్రజలను ఇబ్బంది పెడుతున్న కాంగ్రెస్ తెలంగాణ ప్రజలను ఆదుకుంటామని చెప్పడం సిగ్గు చేటని పేర్కొన్నారు. ఆ పార్టీ నాయకులకు వారి అభివృద్ధి తప్ప రాష్ట్ర ప్రజల బాగోగులు పట్టవని కడియం శ్రీహరి విమర్శించారు.

### నిరూపిస్తే పోటీ నుంచి తప్పుకుంటా..

తెలంగాణ ప్రజల అభివృద్ధే ధ్యేయంగా ముఖ్యమంత్రి కేసీఆర్ అమలు చేస్తున్న దళితబంధు, కేసీఆర్ కిట్టు, ఆసరా పెన్షన్, రైతు బీమా, రైతు బంధు వంటి పథకాలను కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్న రాష్ట్రాల్లో ఉన్నాయా? అని ప్రశ్నించారు. ఒకవేళ అమలు అవుతున్నట్లు నిరూపిస్తే ఎన్నికల బరిలో నుంచి తప్పుకుంటానని, నిరూపించకపోతే కాంగ్రెస్ పార్టీ పోటీ నుంచి తప్పుకోవాలని కడియం డిమాండ్ చేశారు. కాంగ్రెస్ పార్టీ నాయకులకు పదవులు లేక మతిభ్రమించి, పిచ్చెక్కి వారు ఏం మాట్లాడుతున్నారో వారికే తెలియడం లేదన్నారు. వారి మాటలు వింటే నవ్వాలో, జాలిపడాలో అర్థం కావడం లేదని అన్నారు. తుపాకీ రాముడిలా, ఉత్తర కుమారులా మాట్లాడుతున్నారని ఎద్దేవా చేశారు. ప్రజలతో ఛీ అనిపించుకున్న రేవంత్ రెడ్డి, రాజగోపాల్‌రెడ్డిలు దమ్ముంటే తమపై పోటీ చేయాలని సవాల్ విసరడం హాస్యాస్పదంగా ఉందన్నారు. ప్రజలు ఛీ కొట్టినా కూడా సవాలు విసిరితే కేఏ పాల్, షర్మిలకు వారికి తేడా ఏముందని ప్రశ్నించారు. ఎన్నికలప్పుడు ఓట్ల కోసం ఎంతో మంది వచ్చి అబద్ధాల హామీలతో ప్రజలను మభ్యపెట్టడానికి వస్తుంటారని, అలాంటి వారి మాటలు నమ్మి వారికి ఓటు వేస్తే రాష్ట్రం ఆగమవుతుందని, అభివృద్ధి కుంటుపడుతుందని, జాగ్రత్తగా ఉండాలని కడియం శ్రీహరి ప్రజలను కోరారు. సమావేశంలో బీఆర్‌ఎస్ జిల్లా నాయకులు చింతకుంట్ల నరేందర్‌రెడ్డి, బెలిదె వెంకన్న, బూర్ల శంకర్, రాపోలు మధుసూదన్‌రెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ అన్నం బ్రహ్మారెడ్డి, సర్పంచ్‌ల ఫోరం మండలాధ్యక్షుడు పోగుల సారంగపాణి, మామిడాల లింగారెడ్డి, ఎంపీపీ సరితా బాలరాజు, మాజీ మండలాధ్యక్షుడు అక్కనపల్లి బాలరాజు, ఎంపీటీసీ రజాక్ యాదవ్, సొసైటీ చైర్మన్ తీగల కరుణాకర్‌రావు, రైతు బంధు సమితి బాధ్యుడు తోట వెంకన్న, గాదె పాక సుధాకర్ బాబు, తెల్లాకుల రామకృష్ణ, జీడీ ప్రసాద్, అన్నెపు కుమార్ పాల్గొన్నారు.



దొంగలు చిందరవందర చేసిన బెడ్

## కాటారంలో రెండిళ్లల్లో దొంగతనం

### మూడున్నర తులాల బంగారం అపహరణ

కాటారం, అక్టోబర్ 25 : మండల కేంద్రంలో రెండిళ్లలో దొంగతనం జరిగింది. మూడున్నర తులాల బంగారు ఆభరణాలు ఎత్తుకెళ్లారు. కాటారం ప్రొబేషనరీ ఎస్సై ప్రసాద్, బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. కాటారం పెట్రోలు బంక్ ఎదురుగా ఉన్న కాలనీలో రేపాల వేణుగోపాల్, ముస్కుల సురేందర్ రెడ్డి ఇండ్లల్లో మంగళవారం రాత్రి దొంగలు చొరబడ్డారు. బాధితులు ఫిర్యాదుతో బుధవారం ప్రొబేషనరీ ఎస్సై ప్రసాద్ ఘటనా స్థలాన్ని పరిశీలించి క్లూస్ టీంతో ఆధారాలు సేకరించారు. కాగా, వేణుగోపాల్ ఇంటి తాళాలు పగులగొట్టిన దొంగలు బీరువాలోని రెండు తులాల బంగారం ఆభరణాలు, సురేందర్ రెడ్డి ఇంట్లో తులంన్నర బంగారం ఆభరణాలు దొంగిలించినట్లు తెలిపారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామన్నారు.

## కేటీపీపీలో బాయిలర్ ట్యూబ్ లీకేజీ

గణపురం, అక్టోబర్ 25 : మండలంలోని చెల్పూర్ కేటీపీపీలో 2వ దశ విద్యుత్ ఉత్పత్తి కేంద్రంలో బుధవారం బాయిలర్ ట్యూబ్ లీకేజీ అయింది. దీంతో 600 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి నిలిచిపోయింది. వెంటనే మరమ్మతులు చేస్తున్నామని, త్వరలోనే ఉత్పత్తిని ప్రారంభిస్తామని జెన్‌కో అధికారులు తెలిపారు.



చెల్పూర్ కేటీపీపీ



పెంబర్తి చెక్ పోస్ట్ వద్ద పరకాల ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి వాహనాన్ని తనిఖీ చేస్తున్న పోలీసులు

## ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి వాహనం తనిఖీ

జనగామ రూరల్, అక్టోబర్ 25 : మండలంలోని పెంబర్తి చెక్‌పోస్టు వద్ద పరకాల ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి వాహనాన్ని జనగామ ఏసీపీ కొత్త దేవేందర్ రెడ్డి బుధవారం తనిఖీ చేశారు. పూర్తిగా తనిఖీ చేసిన అనంతరం పంపించారు.

## మద్యం పట్టివేత

గీసుగొండ, అక్టోబర్ 25 : మండల కేంద్రంలో బుధవారం టాస్క్‌ఫోర్స్ పోలీసులు కిరాణా షాపులో అక్రమంగా నిల్వ చేసి మద్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు టాస్క్‌ఫోర్స్ ఏసీపీ మధుసూదన్ తెలిపారు. పాకనాటి స్వప్న కిరాణా షాపు నడుపుతూ అక్రమంగా మద్యం విక్రయిస్తున్న విషయం తెలుసుకొని దాడి చేశామన్నారు. షాపులో నిల్వ చేసిన రూ. 40 వేల విలువైన మద్యం స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. బెల్టుషాపు నిర్వాహకురాలిపై కేసు నమోదు చేశామన్నారు. కేసును గీసుగొండ పోలీసు స్టేషన్‌కు బదిలీ చేసినట్లు చెప్పారు.



గీసుగొండలోని బెల్టు షాపులో అక్రమంగా నిల్వ చేసిన మద్యాన్ని పట్టుకున్న టాస్క్‌ఫోర్స్ పోలీసులు

# 11 కిలోల ఎండు గంజాయి స్వాధీనం

- గంజాయి విలువ రూ.2.75 లక్షలు
- ఒడిశా రాష్ట్రానికి చెందిన నిందితుడి అరెస్టు

నెక్కొండ, అక్టోబర్ 25 : రూ.2.75లక్షల విలువైన ఎండు గంజాయిని పట్టుకున్నట్లు సీఐ హతీరాం తెలిపారు. నెక్కొండ పోలీస్‌స్టేషన్‌లో బుధవారం ఎస్సై జానీపాషాతో కలిసి సీఐ వివరాలను వెల్లడించారు. ఒడిశా రాష్ట్రం గంజాం జిల్లా దొవగాన్ గ్రామానికి చెందిన గోబింద బెహర్ బుధవారం నెక్కొండ రైల్వే స్టేషన్ ప్రాంతంలో గంజాయి రవాణా చేస్తుండగా పోలీసులు పట్టుకున్నారు. 11 కిలోల ఎండు గంజాయిని డిప్యూటీ తహసీల్దార్ పీ రవి సమక్షంలో స్వాధీనం చేసుకున్నామని, గంజాయి విలువ రూ.2.75లక్షలని తెలిపారు. ఒడిశాలోని మల్కన్ గిరి జిల్లా ఖలెమెలా మండలం ఎంపీబీ-26కు చెందిన సమీర్ హోల్డర్ నుంచి ఎండు గంజాయి కొనుగోలు చేశాడని సీఐ చెప్పారు. నిందితుడిని రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. కానిస్టేబుళ్లు ఎస్ రాకేశ్, ఎండీ అన్వర్‌ఖాన్ పాల్గొన్నారు.




నెక్కొండలో పట్టుకున్న 11 కిలోల ఎండు గంజాయి, నిందితుడు గోబింద బెహర్ అరెస్టును చూపుతున్న సీఐ హతీరాం, ఎస్సై జానీపాషా

## గుడుంబా స్థావరంపై దాడి

మహాముత్తారం, అక్టోబర్ 25 : గుడుంబా తయారు చేసినా, విక్రయించినా చట్ట పరమైన చర్యలు తప్పవని ఎస్సై సుధాకర్ హెచ్చరించారు. బుధవారం మండలంలోని కొర్లకుంట గ్రామ పంచాయతీ పరిధిలోని లంబాడిపల్లిలో సిబ్బందితో కలిసి గుడుంబా స్థావరంపై దాడి చేసి బెల్లం పానకం, తయారీ సామగ్రిని ధ్వంసం చేశారు. గుడుంబా తయారు చేస్తున్న అజ్మీరా కేస్లీబాయ్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై సుధాకర్ తెలిపారు.

## కొత్త పత్తి కొనుగోళ్లు ప్రారంభం

### మద్దతు ధర క్వింటాల్‌కు రూ.7,021

కాశీబుగ్గ, అక్టోబర్ 25 : వరంగల్ ఎనుమాముల వ్యవసాయ మార్కెట్‌లో బుధవారం కొత్త పత్తి కొనుగోళ్లు ప్రారంభించారు. చాంబర్ అధ్యక్షుడు బొమ్మినేని రవీందర్‌రెడ్డి, కార్యదర్శి మడూరి వేదప్రకాశ్‌తో పాటు కాటన్ ఖరీదు, అడ్తి వ్యాపారులు, మార్కెట్ కమిటీ సెక్రటరీ బీవీ రాహుల్, ఇతర అధికారులు, వివిధ కార్మిక సంఘాల ప్రతినిధులు హాజరయ్యారు. ఐనవోలు మండలంలోని వనమాల కనపర్తికి చెందిన గాదె కృష్ణమూర్తి 23 పత్తి బస్తాలు తీసుకురాగా, వాణి ట్రేడర్స్ అడ్తి ద్వారా సప్తగిరి జిన్నింగ్ అండ్ ప్రెస్సింగ్ మిల్లు యజమాని క్వింటాల్‌కు రూ.7021తో కొనుగోలు చేశాడు. కేంద్ర ప్రభుత్వం నిర్ణయించిన కొత్త మద్దతు ధర క్వింటాల్‌కు రూ.7020 అమలు చేస్తున్నట్లు మార్కెట్ వర్గాలు తెలిపాయి.



ప్రత్యేక పూజలు చేసి కొత్త పత్తి కొనుగోళ్లను ప్రారంభిస్తున్న చాంబర్ అధ్యక్షుడు బొమ్మినేని రవీందర్‌రెడ్డి